క్లుప్తంగా

జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు ప్రారంభం



వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి

కోదాడరూరల్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టీపీసీసీ సభ్యుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ది కోదాడ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ సలీం షరీఫ్, వేనేపల్లి శ్రీనివాసరావు, మహేంద్రకుమార్, జానకిరాం రెడ్డి, శ్రీనివాసరావు, కృష్ణయ్య, ఖలీల్, విశ్వజ్ఞచారి, కళ్యాణ్, సతీష్, గోపి ఉన్నారు.

బీసీలను మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

గరిడేపల్లి : రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు చట్టబద్ధత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒంటరిగా కాకుండా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి పోరాటం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అబ్బిరెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ సర్కారు మాయ మాటలు చెప్పి బీసీలను మోసం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నిమ్మల సైదులు, దస్తగిరి, హుస్సేన్, యాట వీరస్వామి, చరణ్, మీరమ్మ, రత్నం, పట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


రైతు బీమా దరఖాస్తుకు 13 చివరి గడువు

చిలుకూరు : జూన్ 5వ తేదీలోపు పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న రైతులు మాత్రమే రైతు బీమాకు అర్హులని తెలిపారు. దరఖాస్తు ఫారానికి ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, నామిని ఆధార్‌కార్డు జీరాక్స్‌లు జత చేసి వ్యవసాయశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ నెల 13వ తేదీ దరఖాస్తుకు చివరి గడువు అని తెలిపారు.

నేరేడుచర్ల : రైతు బీమా దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 13వ తేదీ చివరి గడువు అని మండల వ్యవసాయ అధికారి జావేద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5వ తేదీ లోపు పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు, ఇంతకుముందే పట్టా పాస్ పుస్తకం వచ్చి రైతు బీమాకు నమోదు చేసుకొని రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మోతె : కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మోతె వ్యవసాయ అధికారిని అరుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18– 59 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన రైతులు రైతు బీమాకు అర్హులని తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు తమ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారికి దరఖాస్తు అందజేయాలని రైతులకు సూచించారు.

గుండెపోటుతో పారిశుద్ధ్య కార్మికుడు మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

మోతె : మండలంలోని రావిపహాడ్ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు పాడవంగి లక్ష్మీనారాయణ (35) శనివారం రాత్రి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గుండెపోటుతో మరణించాడు. మృతుడికి భార్య రేణుక, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. ఇంటిపెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరై విలపించారు. కాగా, ఆదివారం లక్ష్మీనారాయణ మృతదేహాన్ని మోతె ఎంపీడీఓ టి.ఆంజనేయులు, కార్మిక సంఘం నాయకులు, గ్రామపెద్దలు సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ పరంగా రూ. 10 వేలు తక్షణ సహాయాన్ని అధికారులు బాధిత కుటుంబానికి అందజేశారు. నివాళులర్పించిన వారిలో పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, మౌనిక, సీఐటీయూ నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మల్టీపర్పస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉన్నారు.

కార్మికులకు వైద్యం, విద్య ఉచితంగా అందించాలి

గరిడేపల్లి : వేల్ఫేర్ బోర్డు కార్డు ద్వారా నిరుపేద కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా వైద్యం, ఉన్నత విద్య అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేద కార్మికుల కుటుంబాల్లో ఎవరైన అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యం కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ఉచితంగా వైద్యాన్ని అందించేవిధంగా పాలకులు కృషి చేయాలని ఆయన అన్నారు. సెప్టెంబర్ 1న జరిగే జిల్లా మూడో మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు

- భూసారానికి పచ్చిరొట్ట, పశువుల పెంట, నల్లమట్టి, జీవామృతాల వినియోగం
- చీడపీడల నివారణకు సొంతంగా కషాయాల తయారీ
- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందుతున్న రైతులు



సిరిపురంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవనశాఖ అధికారి



అనంతగిరి మండలం చనుపల్లిలో రైతు వెంకటేశ్వరరెడ్డి ప్రకృతి వ్యవసాయ క్షేత్రం (ఫైల్)

నడిగూడెం : భూపరిరక్షణ కోసం పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం చేపడుతున్నారు. ఎలాంటి రసాయన ఎరువులు వినియోగించుకుండా సహజసిద్ధ పద్ధతుల్లో వరి సాగు చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కోదాడ నియోజకవర్గంలో నడిగూడెం, అనంతగిరి, కోదాడ, చిలుకూరు, మునగాల, మోతె మండలాల్లో గల పలు గ్రామాల్లో పలువురు రైతులు వ్యవసాయ శాఖ, స్వచ్ఛంద సంస్థల సహకారం, తోటి రైతులు చేపట్టే చైతన్య కార్యక్రమాలతో ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కనబరుస్తున్నారు. కొందరు రైతులు తమ కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం ఒక్కో ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేస్తుండగా, కొందరు రైతులు సహజసిద్ధంగా పంట పండిస్తూ ఆదాయం పొందుతున్నారు. జిల్లాలోని పలువురు రైతులు పాతకాలం నాటి దేశీ వంగడాలను కూడా సహజసిద్ధ పద్ధతిలో సాగు చేస్తున్నారు. వందల ఏళ్ల నాటి దేశీ రకాలైన నవరా, బ్లాక్ రైస్, చిట్టిముత్యాలు, మైసూరు మల్లిక లాంటి రకాలను సాగు చూస్తున్నారు. పండిన పంటను బియ్యం రూపంలో మార్చి స్వతహాగా మార్కెట్ చేసుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొందరు రైతులు ప్రకృతి వ్యవసాయం పితామహుడు సుభాష్ పాలేకర్ వద్ద శిక్షణ పొంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. తక్కువ పెట్టుబడులతో వ్యవసాయం చేస్తూ ఎక్కువ ఆదాయం పొందుతున్నారు.



గోంద్రియాలలో తూటికాడ కషాయం తయారు చేస్తున్న వెంకటప్పయ్య

సహజసిద్ధ పద్ధతులు ఇవీ..

భూసారం పెరిగేందుకు జీవామృతం, ఘన జీవామృతం, పశువుల పెంట, గొర్రెల పెంట, చెరువు మట్టి వేస్తుండడంతో పాటు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పెసర సాగు చేసి భూమిలో కలియదున్నుతున్నారు. చీడ, పీడల నివారణకు వేప గింజల కషాయం, వేప నూనె, నీమాస్త్రం, వావిలాకు కషాయం, తూడికాడ కషాయం, అగ్నిహాస్త్రం, బ్రహ్మాస్త్రం, పచ్చిమిర్చి, వెల్లుల్లి, తదితర ద్రావణాలను తయారు చేసుకొని చీడ, పీడలను అదుపులో పెడుతున్నారు.

సమీకృత వ్యవసాయం చేస్తున్న



మాకున్న వ్యవసాయ భూమిలో 1.50 ఎకరాల్లో గత నాలుగు ఏళ్లగా సమీకృత వ్యవసాయం చేస్తున్నాను. దాదాపు 40 రకాల పంటలను సాగు చేస్తూ నిత్యం ఆదాయం పొందుతున్నాను. కూరగాయలు, ఉద్యానవన పంటలైన పండ్ల తోటలు, పూల తోటలు సాగు చేస్తున్నాను.

– వాసికర్ల శేషుకుమార్, రైతు, సిరిపురం

13 ఏళ్లుగా గోఆధారిత ప్రకృతి వ్యవసాయం చేస్తున్న



2012లో ప్రకృతి వ్యవసాయ పితామహుడు సుభాష్ పాలేకర్ వద్ద ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణ పొందాను. అప్పటి నుంచి నాలుగు ఎకరాల్లో పూర్తిగా గోఆధారిత ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. దేశవాళి రకాలు, చిరు ధాన్యాలు, పప్పుదినుసులు, పసుపు, అల్లం, వేరుశనగ కూడా సాగు చేస్తున్నాను. అలాగే గోఆధారిత ఉత్పత్తులు కూడా తయారు చేస్తున్నాను.

– నాగిరెడ్డి వెంకటరెడ్డి, రైతు, నారాయణపురం

బియ్యం విక్రయంతో ఆదాయం



నాకున్న వ్యవసాయ భూమిలో ఐదు ఎకరాల్లో 2017 నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. పూర్తిగా వరి పంట వేస్తాను. వానాకాలం సాగు చేసి, వేసవి పంటకు క్రాప్ హాలిడే పాటిస్తున్నాను. జీవామృతం, నీమాస్త్రం, చేపతో తయారు చేసిన ద్రావణం ఉపయోగిస్తాను. మాకు రైస్ మిల్ ఉండడంతో బియ్యం పట్టించి కోదాడ, ఖమ్మం, హైదరాబాద్‌లలో వినియోగదారులకు విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నాను. నాలుగు ఎకరాల్లో మామిడి తోటలను కూడా ప్రకృతి విధానంలో సాగు చేస్తున్నాను.

– నెల్లూరి వెంకటప్పయ్య, గోంద్రియాల, అనంతగిరి మండలం

ప్రభుత్వం ప్రోత్సహించాలి



నాకున్న నాలుగు ఎకరాల్లో గత 13 సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. నవారా, మైసూరు మల్లిక, కుజుపటాలియా లాంటి దేశీయ వరి వంగడాలను సాగు చేస్తున్నాను. ధాన్యాన్ని మర పట్టించి బియ్యాన్ని కోదాడ, హైదరాబాద్, ఖమ్మం, బెంగళూరు నగరాల్లో ఫోన్ ఆర్డర్ల ద్వారా విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నాను. మా లాగా ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. కలుపు తీసేవి, నాట్లు పెట్టే యంత్రాలు రాయితీపై అందించాలి.

– ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, చనుపల్లి, అనంతగిరి మండలం

కోదాడకు ‘నవోదయ’ మంజూరు హర్షణీయం



మునగాల : మాట్లాడుతున్న జిల్లేపల్లి వెంకటేశ్వర్లు

మునగాల : కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభివృద్ధికి జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి కృషిచేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మునగాలలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోదాడకు జవహర్ నవోదయ విద్యాలయం మంజూరు హర్షణీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉండి వెనుకబడిన విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన సీబీఎస్‌సీ విద్య అందించాలనే లక్ష్యంతో కోదాడ నియోజకవర్గానికి జవహర్ నవోదయ విద్యాలయం మంజూరు చేయించిన ఉత్తమ్ దంపతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట ప్రవీణ్, జిల్లేపల్లి నాగి, జె.నరేష్, జె.వినయ్ పాల్గొన్నారు.

ఉత్తమ్, పద్మావతి ఫ్లెక్సీకి పాలాభిషేకం

కోదాడరూరల్ : కోదాడలో జవహర్ నవోదయ విద్యాలయం నిర్మాణానికి రూ.50 కోట్లు, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి రూ.16.89 కోట్ల నిధులు మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఫ్లెక్సీకి ఆదివారం కోదాడలో మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎర్నేని బాబు మాట్లాడుతూ.. కోదాడ నియోజకవర్గాన్ని రూ.వేల కోట్లతో అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మంత్రి ఉత్తమ్ దంపతులకు ప్రజలు రుణపడి ఉంటారన్నారు. కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో మూడున్నర కోట్ల రూపాయల నిధులతో సీటీ స్కాన్ తీసుకొచ్చి పేద ప్రజలపై భారం పడకుండా చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఖాజా, యంద నిర్మల, విద్యాసాగర్, అనిల్, బ్రహ్మం, కృష్ణారావు, నలజాల శ్రీనివాసరావు ఉన్నారు.



కోదాడరూరల్ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బాబు, తదితరులు

పేద విద్యార్థులకు అండగా ఉంటాం



విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్న కాకతీయ సేవా సమితి సభ్యులు

కోదాడరూరల్ : ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను కాకతీయ సేవా సమితి అండగా ఉంటుందని సమితి సభ్యులు అన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 16 మంది నిరుపేద విద్యార్థులకు మాజీ మంత్రి వీరేపల్లి లక్ష్మీనారాయణ భార్య జ్ఞాపకార్థం ఇచ్చిన రూ.3.30 లక్షలను ఆదివారం పట్టణంలోని బైపాస్‌లో గల కాకతీయ సేవా సంఘం భవన్‌లో అందజేసి మాట్లాడారు. కులమతాలకు అతీతంగా ప్రతిభ కలిగిన విద్యార్థులను, ఆపదలో ఉన్న పేదలకు కాకతీయ సేవాసమితి తమ వంతుగా సహాయసహకారాలు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పెదనాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వేమూరి సురేష్, రావెళ్ల సీతరామయ్య, వీరేపల్లి సుబ్బారావు, డాక్టర్ సుబ్బారావు, ముత్తవరపు పాండురంగారావు, రామారావు, సత్యనారాయణ, బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

గ్రామీణ కళాకారులకు గుర్తింపునిస్తాం



హుజూర్‌నగర్ : ఉమారాణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారులకు ప్రభుత్వం గుర్తింపునిచ్చి ప్రోత్సహిస్తుందని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సినీనటుడు చిరంజీవి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఆదివారం కోదాడలోని కిట్స్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాటల పోటీల విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరంజీవి అభిమానులు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయన్నారు. చిరంజీవి యువత సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుండెపంగు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత మాస్టర్జీ, సినీ మ్యూజిక్ డైరెక్టర్ రవి కళ్యాణ్, బైరు వెంకన్నగౌడ్, సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, వి.రామారావు, ఎస్.సత్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, వి.వెంకటేశ్వర్లు, సైదులు, తిరుప్, కిరణ్, పాండు, రవి, కుదుముల శివ, ప్రశాంత్, రాంబాబు, రవి, రజిని, యేసు తదితరులు పాల్గొన్నారు.

ఉమారాణికి నివాళి

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఆదివారం గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ అల్లం ప్రభాకర్‌రెడ్డి సతీమణి అల్లం ఉమారాణి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ ఎమ్మెల్యే పద్మావతి పాల్గొని ఉమారాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్‌సీఎం ఫాదర్స్, సిస్టర్స్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నివాళులర్పించిన వారిలో క్రైస్తవ సంఘం, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తిరంగా యాత్రను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్

హుజూర్‌నగర్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించబోయే హర్ ఘర్ తిరంగా, తిరంగా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్, రాష్ట్ర నాయకుడు బొలిశెట్టి కృష్ణయ్య అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు ప్రతిఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేయాలని చెప్పారు. పట్టణంలోని ప్రతి వార్డులో తిరంగా యాత్ర నిర్వహించాలని కోరారు. పహల్ గామ్ ఉగ్రదాడికి నిరసనగా మన జాతీయతను చాటే ఈ తిరంగా యాత్ర ద్వారా సరిహద్దుల్లో ఉన్న సైనికులకు మనో ధైర్యం అందించి స్ఫూర్తిగా నిలబడాలని వారు కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా నాయకుడు డి.రామరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా గోపి, నాయకులు గుండా నాగరాజు, బలవంత్ సింగ్, ఎస్.నాగరాజు, కనకయ్య, పి.విజయ్, జి.నరసింహా రావు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

‘అరిబండి’ స్ఫూర్తితో ముందుకు సాగాలి



అరిబండి లక్ష్మీనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నేరేడుచర్ల : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే అరిబండి లక్ష్మీనారాయణ ఆశయ స్ఫూర్తితో పార్టీ కార్యకర్తలు ముందుకు సాగాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్ అన్నారు. ఆదివారం నేరేడుచర్లలోని సీపీఎం కార్యాలయంలో అరిబండి లక్ష్మీనారాయణ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాయుధ పోరాటంలో లక్ష్మీనారాయణ ప్రధాన భూమిక పోషించారన్నారు. నిజాం నిరంకుశ విధానాలపై రాజీలేని పోరాటం చేసిన మహనీయుడు లక్ష్మీనారాయణ అని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నీలా రామ్మూర్తి, సట్టు శ్రీను, గుర్రం ఏసు, గుంజ రవీందర్ తదితరులు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రాములు

కోదాడ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు అన్ని వర్గాల ప్రజలు మద్దతునివ్వాలని, ఆ దిశగా ప్రభుత్వం అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ముందుకు పోవాలని పలువురు వక్తలు కోరారు. ఆదివారం కోదాడ పబ్లిక్ క్లబ్ ఆవరణలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు పలు సంఘాల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుకుంటుందని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, అప్పుడే చట్ట బద్ధత వస్తుందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని పలువురు డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ముత్యాలు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, ఈదుల కృష్ణయ్యయాదవ్, చింతాబాబు మాదిగ, బడుగుల సైదులు, రాయపూడి చిన్ని, చింతలపాటి శ్రీనివాస్, కత్తి వెంకటేశ్వర్లు, సంగిశెట్టి గోపాల్, బత్తుల ఉపేందర్, సైదులు, బ్రహ్మయ్య, కృష్ణమూర్తి, జంగంపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ బోనాల పండుగ

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను తలపై ఎత్తుకొని దప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బొడ్రాయికి, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



హుజూర్‌నగర్ : లక్కవరంలో బోనాల ఊరేగింపులో పోతరాజు విన్యాసాలు



నేరేడుచర్ల : నర్సయ్యగూడెంలో బోనాలతో ఊరేగింపుగా ముత్యాలమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు



హుజూర్‌నగర్ : లక్కవరంలో బోనాల వేడుకలో నృత్యాలు చేస్తున్న మహిళలు



కోదాడరూరల్ : రామలక్ష్మీపురంలో..



మోతె : రావిపహాడ్‌లో..



నేరేడుచర్ల : బోనాలు సమర్పిస్తున్న భక్తులు



మేళ్లచెరువు : రామాపురంలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు



నడిగూడెం : రామాపురంలో..

డ్రెయినేజీ పరిశుభ్రం



జేసీబీ సహాయంతో డ్రెయినేజీని శుభ్రం చేయిస్తున్న కార్యదర్శి రజిత

సాక్షి ఎఫెక్ట్

చిలుకూరు : మండలంలోని జానకీనగర్ గ్రామంలో మురుగు నీరు పారకుండా డ్రెయినేజీని కొందరు పూడ్చివేయడంతో ప్రధాన రహదారిలో మురుగు నీరు ప్రవహిస్తూ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆదివారం సాక్షి దినపత్రికలో ‘మురుగు పారే దారేది’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామస్తుల సహకారంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి రజిత జేసీబీతో డ్రెయినేజీని శుభ్రం చేయించారు. మురుగు కాలువలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దీంతో ప్రజల సమస్య పరిష్కారమైంది.

దివ్యజ్ఞానంతో విజయం సాధించాలి

హుజూర్‌నగర్ : దివ్య జ్ఞానంతో అంతరంగ శత్రువులైన కామ, క్రోధములపై విజయం సాధించాలని హైదరాబాద్ అబిడ్స్‌లోని ఇస్కాన్ టెంపుల్ భగవద్గీత ప్రచారకులు ప్రభుజి హృషికేశ దాస్ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో భగవద్గీత నాల్గవ అధ్యాయంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనుషుల్లో ఉండే కామ క్రోధములు వారి జీవితాన్ని కష్టాలపాలు చేస్తాయని అన్నారు. దివ్య జ్ఞానం పొందటం, హరి నామ సాధన ద్వారా కామ క్రోధములకు లోబడకుండా వాటిపై విజయం సాధించవచ్చని చెప్పారు. అనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో ఎం.సత్యనారాయణ, శ్రీమన్నారాయణ, చంద్రశేఖర్, నాని, శ్రీను, రాధా, నరసింహారావు, గణేష్, శ్రీనివాసరావు, సతీష్ పాల్గొన్నారు.



భగవద్గీత ప్రచారకుడితో నిర్వాహకులు

నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

మేళ్లచెరువు : రిటైర్డు ఉద్యోగుల సంఘం ఉమ్మడి మండల కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం మేళ్లచెరువు మండల కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతరామయ్య ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వై.పుల్లయ్య, కార్యదర్శిగా పూర్ణాచారి, కోశాధికారిగా కె.యల్‌ఎన్‌రెడ్డి, అసోషియేట్ అధ్యక్షులుగా వెంకటరెడ్డి, శ్రీనివాసాచార్యులు ఉపాధ్యక్షుడు, ఇతర సభ్యులుగా నాగేశ్వరి, రమణారెడ్డి, సుగుణమ్మ, ఫాతిమా, భద్రును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, విద్యాసాగర్, గద్దం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.